క్లుప్తంగా

ముంచంగిపుట్టు ఎంపీడీవోగా రమేష్



బాధ్యతలు స్వీకరిస్తున్న రమేష్

ముంచంగిపుట్టు: స్థానిక ఎంపీడీవోగా ఆర్.వి.ఎస్.రమేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడఎంపీడీవో కిరణ్‌కుమార్ ఆరు నెలల ట్రైనింగ్ కోసం వెళ్లడంతో జి.మాడుగుల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్‌డీవోగా పనిచేస్తున్న రమేష్‌ను అదనపు బాధ్యతలపై ఇక్కడ ఎంపీడీవోగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన రమేష్ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహిస్తానని చెప్పారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలందించి అభినందనలు తెలిపారు.

వంతెన మలుపులో చెట్ల తొలగింపు



తొలగించిన చెట్ల మొదళ్లు

కొయ్యూరు:ఎట్టకేలకు ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. కాకరపాడు వంతెన మలుపు సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మూడు చింత చెట్లను శనివారం తొలగించారు. నాలుగు సంవత్సరాలుగా చింతచెట్లు ఒకవైపునకు ఒరిగిపోయి ఉన్నాయి. వాటిని తొలగించాలని పదేపదే వినతులు వెళ్లడంతో శనివారం ఆర్‌అండ్‌బీ జేఈ ప్రసాద్ ఆ చెట్లను తొలగించారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

హుకుంపేటలో భారీ వర్షం

హుకుంపేట: మండల కేంద్రంతో పాటు మండలంలోని కొట్నాపల్లి,పాతకోట,సూకురు, శోభకోట,తీగలవలస,మట్టుజోరు పంచాయతీల్లో శనివారం భారీవర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతమైన కామయ్యపేట ప్రధాన రహదారి జలమయమైంది. దీంతో వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. మండల కేంద్రంలో జరిగిన సంతకు వచ్చిన వ్యాపారులు, గిరిజనులు అవస్థలకు గురయ్యారు. పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

తక్షణ సాయం అందజేత

మాడుగుల: గాదిరాయి గ్రామానికి చెందిన ముద్దుర్తి వెంకటరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఇతని భార్య రామలక్ష్మికి వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10 వేలు వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ శనివారం అందజేశారు. మిగతా రూ.90 వేలు నామినీ బ్యాంకు ఖాతాలో జమ కానున్నాయని తెలిపారు.

ఏకగ్రీవంగా అధ్యక్ష,కార్యదర్శుల ఎన్నిక



నూతనంగా ఎన్నికైన అధ్యక్షకార్యదర్శులతో సభ్యులు

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలో గురువారం భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్ష,కార్యదర్శులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామకృష్ణ,ఉపాధ్యాక్షుడిగా లోవ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.కార్మికుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు.కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

మండల సమావేశం రేపు

రాజవొమ్మంగి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు మండలప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో బాపన్నదొర తెలిపారు. ఎంపీపీ వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన పలు అంశాలపై సమీక్ష ఉంటుందన్నారు. సంబంధిత అధికారులు పూర్తి వివరాలతో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601
సాక్షి

పది పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

జిల్లాలో టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 3 నుంచి ప్రారంభమయ్యే పరీక్షల కోసం పటిష్ట ఏర్పాట్లు చేపట్టారు. అన్ని కేంద్రాల్లో బెంచీలు, తాగునీటి సౌకర్యం కల్పించారు.



ముసుళ్లకుంట పరీక్షకేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఈవో , డీవో, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ తదితరులు



సింగంపల్లి ఆశ్రమోన్నత పాఠశాలలో బల్లలపై నంబర్లు అతికిస్తున్న ఆనందబాబు, సుబ్రహ్మణ్యేశ్వరి

కొయ్యూరు: మండలంలో మొత్తం 645 మంది పరీక్షలు రాయనున్నారు. గురుకుల పాఠశాల,ప్రభుత్వోన్నత పాఠశాల, బాలుర ఆశ్రమ పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. గురుకుల పాఠశాలలో 240 మంది, ఆశ్రమ పాఠశాలలో 231మంది, ప్రభుత్వోన్నత పాఠశాలలో 174 మంది పరీక్షలు రాయనున్నారు.మూడు కేంద్రాలకు డిపార్ట్‌మెంట్ అధికారులు(డీవో)లుగా డి.బాలమురళీ కృష్ణ, కె.బాలన్న, పి.అప్పారావులను నియమించారు.

అడ్డతీగల: మండలంలో 361 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరుకానున్నట్టు ఎంఈవో వై.మల్లేశ్వరరావు తెలిపారు. అడ్డతీగలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 మంది,గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ఎనిమిది మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. ఒక్కో డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, సూపరింటెండెంట్ విధులు పర్యవేక్షిస్తారు.

రాజవొమ్మంగి : పదవ తరగతి పబ్లిక్ పరీక్షల కోసం మండలంలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎంఈవో తాతబ్బాయిదొర తెలిపారు. మండల వ్యాప్తంగా గల 10 పాఠశాలలకు చెందిన మొత్తం 478 మంది విద్యార్థినీవిద్యార్థులు ఈ ఏడాది పది పరీక్షలు రాయనున్నట్టు ఆయన చెప్పారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, బాలుర ఆశ్రమోన్నతపాఠశాల, జడ్డంగి బాలికల ఆశ్రమ పాఠశాల, సింగంపల్లి బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో పరీక్షకేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

ఎటపాక: మండలంలోని పది పాఠశాలలకు చెందిన 262 మంది విద్యార్థులు రెండు కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. గౌరీదేవిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో సీతాపురం,నందిగామ, నెల్లిపాక,గౌరీదేవిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులతో పాటు శ్రీఆదిత్య స్కూల్ విద్యార్థులు కలిపి మొత్తం 116 మంది పరీక్ష రాయనున్నారు. కేఎస్ పురం గిరిజన ఆశ్రమ పాఠశాల పరీక్ష కేంద్రంలో కేజీబీవీ,కేఎస్ పురం బాలుర ఆశ్రమ పాఠశాల,నల్లకుంట గిరిజన ఆశ్రమ పాఠశాల,పినపల్లి,గొల్లగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 146 మంది పరీక్ష రాయనున్నారని ఎంఈవో నీలి బాలరాజు తెలిపారు.

దేవీపట్నం: పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈవో వై.మల్లేశ్వరరావు తెలిపారు. మండలంలో తొలిసారిగా ముసుళ్లకుంట గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను పరీక్షకేంద్రంగా ఎంపిక చేసినట్టు ఆయన చెప్పారు. ఇందుకూరుపేట జిల్లాపరిషత్ఉన్నత పాఠశాల, ముసుళ్లకుంట గిరిజన సంక్షేమ బాలికల వసతిగృహం, కొత్తవీధి గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహం, దేవీపట్నం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, రంపచోడవరం మండలం కె.ఎర్రంపాలెం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలకు చెందిన 241 మంది విద్యార్థులు ఇక్కడ పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నిర్వహణపై ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇచ్చినట్టు ఎంఈవోతెలిపారు. పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను డీఈ డి.సత్యవతి, ఎంఈవో మల్లేశ్వరరావు, ఇతర అధికారులు పరిశీలించారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అరకులోయ రూరల్: మండలంలోని యండపల్లివలస కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పాఠశాల ప్రిన్సిపాల్ స్వాభి సుశీల తెలిపారు. 2023–24 విద్య సంవత్సరంలో కస్తూర్బా గాంధీ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పించనున్నట్టు చెప్పారు. పాఠశాలలో 6,7,8,9, తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేయనున్నామని, ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులే స్వీకరిస్తామన్నారు. పూర్తి సమచారం కోసం 6302372851 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

5 నుంచి నారాయణగిరి వెంకన్న బ్రహ్మోత్సవాలు

రంపచోడవరం: స్థానిక నారాయణగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ద్వారకా తిరుమల దత్తత దేవాలయం కావడంతో వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. 5వ తేదీన స్నపనం, సాముహిక విష్ణు సహస్రనామార్చన, పూజలు జరుగుతాయి.ఆరో తేదీన ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ట పూజలు నిర్వహించనున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

• ఎంపీపీ ఉషారాణి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉషారాణి

అరకులోయ రూరల్: మండలంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు ఎంపీపీ ఉషారాణి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆమె మాట్లాడుతూ గత సర్వ సభ్య సమావేశంలో తీర్మానించిన అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సకాలంలో లబ్ధిదారులకు అందేలా సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. మండలంలో 14 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన రహదారులు,ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు దుర్వినియోగం జరుగుతున్నట్టు చెప్పారు. అడ్వాన్స్ రూపంలో నిధులు దారి మళ్లించాలన్నారు. ప్రజాప్రతినిధులకు ఎటువంటి సమచారం ఇవ్వకుండా కాంట్రాక్టర్‌తో సంబంధిత అధికారులు కుమ్మక్కై బిల్లులను ఇష్టారాజ్యంగా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులపై విచారణ చేపట్టాలని సభ్యులు కోరారు. అనంతరం అరకులోయ పట్టణంలో 1/70 చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని, అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలని,ప్రభుత్వ భూములు పరిరక్షించాలని, బోయవాల్మీకి,బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాల్లో చేర్చవద్దని కోరుతూ తీర్మానం చేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వేణుగోపాల్,ఏవో రాంబాబు, వైస్ ఎంపీపీలు రామన్న,సుమంజాలి,సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

జూన్‌లో గిరిజన సంఘం మహాసభలు

అరకులోయ రూరల్: మండల కేంద్రం అరకులోయలో జూన్ 5 నుంచి 7వ తేదీ వరకు జరిగే గిరిజన సంఘం రాష్ట్ర 8వ మహాసభలను విజయవంతం చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గిరిజన హక్కులు, చట్టాలపై ఆ సభల్లో చర్చించనున్నట్టు చెప్పారు.

ఛలో ఢిల్లీ విజయవంతం చేయండి

రాజవొమ్మంగి : ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజవొమ్మంగి సీఐటీయూ, రైతు,కార్మిక సంఘం సభ్యులు, భవన నిర్మాణ సంఘం, చేతివృత్తి దారుల సమన్వయ కమిటీ సభ్యులు కోరారు. శనివారం స్థానిక తాపీ మేస్త్రీల సంఘం భవనంలో కార్మికసంఘాల సమావేశం జరిగింది. సీఐటీయూ నాయకులు వీరబాబు మాట్లాడుతూ రైతు బాగుపడాలంటే కనీస మద్దతు ధర చట్టం తేవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని, భవనకార్మికుల సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శ్రీనివాస్, శివ, రాజుబాబు, ప్రసాద్, రాఘవ తదతరులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి



లంబసింగిలో పరీక్ష సామగ్రిని పంపిణీ చేస్తున్న ఎంఈవో ప్రసాద్, శివరాం,శ్రీను, శ్రీధర్



గౌరీదేవిపేటలో టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న దాతలు

చింతపల్లి: పదోతరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలని మండల విద్యాశాఖ అధికారి పనసల ప్రసాద్ అన్నారు. లంబసింగి గ్రామానికి చెందిన గసాడ శ్రీనివాసరావు లంబసింగి ప్రభుత్వ పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు శనివారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఎంఈవో ప్రసాద్, జీఎస్‌టీయూ ప్రొఫెసర్ శివరాం చేతులమీదుగా వీటిని అందజేశారు. విద్యాకమిటీ చైర్మన్ శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎటపాక: మండంలోని గౌరీదేవిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రిని శనివారం పలువురు అందజేశారు.గౌరీదేవిపేట గ్రామానికి చెందిన దారా రామకృష్ణ జ్ఞాపకార్థం ఆయన సోదరుడు రవి 18మంది విద్యార్థులకు ప్యాడ్లు,పెన్నులు,పెన్సిళ్లు, స్కేళ్లు, పరీక్ష కేంద్రంలోకి గోడగడియారాలను హెచ్‌ఎం రాజులు చేతుల మీదుగా అందజేశారు. ఎటపాక సీఐ గజేంద్రకుమార్,ఎస్ఐ పార్థసారథి ఆధ్వర్యంలో కేజీబీవీ, పినపల్లి,కేఎస్ పురం,గౌరీదేవిపేట పాఠశాలల పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్లు,పెన్నులు అందజేశారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ లలిత కుమారి

మారేడుమిల్లి : విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ లలిత కుమారి తెలిపారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని శనివారం పాఠశాల సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎంపీపీ లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు, సర్పంచ్ కొండ జాకబ్, వైఎస్ ఎంపీపీ లక్కొండ రవికుమార్, కో–ఆప్షన్ సభ్యుడు గురుకు దర్మరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ టెన్త్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రామారావు, బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం డి.ఎస్. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చోడవరంలో అదనపు జిల్లా జడ్జి తనిఖీ



అదనపు జిల్లా జడ్జిని సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డేవిడ్

చోడవరం రూరల్: సాధారణ తనిఖీల్లో భాగంగా ఉమ్మడి విశాఖ అదనపు జిల్లా జడ్జి పి.గోవర్ధన్ శనివారం చోడవరం కోర్టులను సందర్శించారు. ఇక్కడ రికార్డుల నిర్వహణ తదితర అంశాలను ఆయన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కోర్టుల పరంగా అవసరమయ్యే మౌలిక సదుపాయాలను గురించి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి సత్తి అరుణశ్రీ, సీనియర్ సివిల్ జడ్జి డి.ఉమాదేవి, జూనియర్ సివిల్ జడ్జి జి.స్వర్ణల నుంచి సమాచారం రాబట్టారు. ఈ సందర్భంగా చోడవరం బార్ అసోసియేషన్ తరపున అదనపు జిల్లా జడ్జి గోవర్ధన్‌ను గౌరవ పూర్వకంగా సత్కరించారు. న్యాయవాదుల సమస్యలను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అసంపూర్తి భవన నిర్మాణాలను పూర్తి చేయించాలని కోరారు. జీపీ సత్యనారాయణ, న్యాయవాదులు వి.వెంకటరావు, సీహెచ్ బాబూరావు, వి.పైడిరాజు, కె.భాస్కరదాస్ పాల్గొన్నారు.

10 లోగా శతశాతం పన్నుల వసూలు

• డీపీవో శిరీషారాణి



చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

మాడుగుల రూరల్: ఇంటి పన్నుల వసూలు ఈ నెల పదో తేదీలోపు శతశాతం పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను జిల్లా పంచాయతీ అధికారి ఆర్. శిరీషారాణి ఆదేశించారు. శనివారం ఆమె ఎంపీడీవో మీనాకుమారితో కలిసి వి.వి.అగ్రహారం చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రాల్లో ఎరువులను విక్రయించడం ద్వారా పంచాయతీలు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చన్నారు. అనంతరం స్థానిక గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. గ్రామ వలంటీర్లు, సిబ్బందితో కలిసి ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి, ఈశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ నృసింహస్వామి కల్యాణోత్సవం



కశింకోటలో నిర్వహిస్తున్న లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం



హాజరైన భక్తులు

కశింకోట : కశింకోటలో శనివారం రాత్రి లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామి వారల ఉత్సవ విగ్రహాలకు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. వినాయక పూజ, రక్ష ధారణ, యజ్ఞోపవేతం, కన్యాదానం,శుభ ముహూర్తాన జీలకర్ర, బెల్లం పెట్టడం, మాంగల్యధారణ, తలంబ్రాలు వేయడం, తదితర ఘట్టాలతో కమనీయంగా కల్యాణోత్సవం జరిగింది, ప్రజలు ఎక్కువ సంఖ్యలో హాజరై ఆసక్తిగా ఆద్యంతం కల్యాణాన్ని తిలకించారు.ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకుడు అత్తిలి కోదండపాణి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఉత్సవం సందర్భంగా స్వామి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. ఉదయం నుంచి ఆలయంలో స్వామి వారిని పూల మాలలు, నూతన వస్త్రాలతో అందంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు ఎక్కువగా దర్శించారు.

మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తులు

అనాథ పిల్లలకు ఆర్థిక భరోసా



సీడీపీవో మేరీ సువార్త

నర్సీపట్నం/మాడుగుల: అనాథులు, నిస్సహాయస్థితిలో పిల్లలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిషన్ వాత్సల్య పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చాయని మాడుగుల, నర్సీపట్నం ఐసీడీఎస్ సీడీపీవోలు శ్రీదేవి, కె.మేరీ సువార్త శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. తల్లిదండ్రులు చనిపోయి అనాథులుగా మారిన పిల్లలకు నెలకు రూ.4 వేలు చొప్పున అందిస్తామన్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.2,400, రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.1600 అందిస్తుందని తెలిపారు. రక్త సంబంధీకుల సంరక్షణతో నివసిస్తూ విద్యను కొనసాగేందుకు స్పాన్సర్‌షిప్‌ను ప్రభుత్వాలు మంజూరు చేస్తున్నాయన్నారు. వితంతువు, విడాకులు తీసుకున్న తల్లి పిల్లలు, తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లలు, ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న తల్లిదండ్రుల పిల్లలు, దీనస్థితిలో ఉన్న పిల్లలు, బాల కార్మికులు, బాల్య వివాహాలు, అక్రమ రవాణాకు గురైన వారి పిల్లలతోపాటు హెచ్ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగులు, తప్పిపోయిన, పారిపోయిన పిల్లలు, యాచక పిల్లలు స్పాన్సర్ షిప్‌కు అర్హులు అన్నారు. పూర్తి వివరాలకు అంగన్‌వాడీ కార్యకర్తలను సంప్రదించాలన్నారు. కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేలు మించి ఉండకూదన్నారు. అర్హత కలిగిన 18 ఏళ్ల లోపు చిన్నారులు వచ్చే నెల 15వ తేదీ లోపు అంగన్‌వాడీ లేదా సచివాలయ పోలీసు ద్వారా సంబంధిత సీడీపీవో కార్యాలయానికి అందజేయాలన్నారు.

102 మందికి వైద్య పరీక్షలు



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యాధికారి లీలాప్రసాదు

మాడుగుల రూరల్: ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా కె.జె.పురం గ్రామ సచివాలయంలో శనివారం బీపీ, సుగర్, ఇతర వ్యాధిగ్రస్తులు 102 మందిని వైద్యాధికారి కె. లీలాప్రసాదు పరీక్షించారు. ఎంపీపీ, హైస్కూలు విద్యార్థులకు, అంగన్‌వాడీ చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక రోగులను పరీక్షించారు. యల్లపు సత్యసూర్యనారాయణమ్మకు బీపీ, సుగర్ అధికంగా ఉందని గుర్తించి వెంటనే 108 వాహనంలో చోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎంపీహెచ్ఈవో పి. రవికుమార్, హెచ్‌వీ పుష్పకాంతం, ఏఎన్‌ఎం శ్రావణి, 104 సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికల ఆత్మరక్షణకు కరాటే



కరాటే విద్యపై శిక్షణ అందిస్తున్న దృశ్యం

మాడుగుల: బాలికల ఆత్మరక్షణకు కరాటే విద్య దోహదపడుతుందని వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ తెలిపారు. శనివారం గాదిరాయి హైస్కూల్‌లో కరాటే శిక్షణ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో మహిళలుపై అరాచకాలకు అడ్డుకట్ట వేయాలంటే విద్యార్థి దశ నుంచే బాలికలకు కరాటే నేర్పించడం అవసరమన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ కంఠం భూములకు త్వరలో రీ సర్వే

కశింకోట : గ్రామ కంఠం భూములకు కూడా త్వరలో రీ–సర్వే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె. సురేష్‌నాయుడు తెలిపారు. కశింకోటలో మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ కంఠం భూములు రెవెన్యూకు సంబంధించినవేనన్నారు. వీటి సర్వే వేరుగా నిర్వహించనున్నారని, ఇందుకు ప్రభుత్వం ఉత్తర్వు లు జారీ చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న రీ–సర్వేలో తప్పులు ఉంటే సవరించుకోవడానికి ఏడాది వరకు సమయం ఉంటుందన్నారు. వివ రాల నమోదులో పొరపాట్లు దొర్లితే తమ దృష్టికి తీసుకు వస్తే విచారించి న్యాయం చేయడానికి కృషి చేస్తామన్నారు.మండలంలోప్రస్తుతం పంట భూముల రీ–సర్వే జరుగుతుందన్నారు. 22 గ్రామాల్లో ఈ నెల 15 వరకు మొదటి విడత సర్వే చేస్తున్నామన్నారు. అనంతరం మరో 5 గ్రామాల్లో సర్వే ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువులు సభ్యులు అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు. తీడలో త్వరితగతిన రీ–సర్వే చేపట్టాలని సర్పంచ్ చిరికి సత్యనారాయణ కోరగా, అందుకు రెండో విడతలో ప్రారంభిస్తామని తహసీల్దార్ బదులిచ్చారు. అలాగే చెరకాం గ్రామంలో 1977లో ఇచ్చిన సుమారు 250 ఎకరాల డి ఫారం పట్టా భూములకు సర్వే జరగక హక్కుదారులు ఇబ్బందులు పడుతున్నారని, దీని సర్వే చేపట్టి రికార్డుల్లో ఇప్పటికైనా నమోదు చేయాలని సర్పంచ్ వెన్నెల దేముళ్లు కోరారు. గతంలో పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకు వచ్చినా ప్రయోజనం లేకపోయిందని, రీ–సర్వేలో అయినా సమస్య పరిష్కరించాలన్నారు. ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు కూడా తీడలో డీ ఫారం పట్టా భూముల సమస్యతోపాటు రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. తాళ్లపాలెం ప్రాంతంలో గెడ్డను, వైఎస్సార్ లే–అవుట్ ప్రాంతంలో స్థలాన్ని ఆక్రమించి కంచె వేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని కోరారు.

నీటిపారుదల శాఖ ఒకే సెక్షన్ పరిధిలోకి తేవాలి:

మండలంలో నీటిపారుదల శాఖ పరిధి అటు అనకాపల్లి, ఇటు యలమంచిలి సెక్షన్ల పరిధిలో విస్తరించి ఉందని, దీనివల్ల ఈ ప్రాంతం ఏ సెక్షన్‌లో ఉందో తెలియక పనులు చేపట్టక రైతులు సతమతమవుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ దృష్ట్యా ఒకే సెక్షన్ పరిధిలోకి తేవడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు శ్రీధర్‌రాజు కోరుతూ చేసిన తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు మాట్లాడుతూ సంపతిపురం వద్ద ఉన్న భారీ రక్షిత మంచి నీటి పథకం ద్వారా గ్రామాల్లో రక్షిత పథకాలకు బురద నీరు సరఫరా అవుతుందని, దీన్ని నివారించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాడేరు డివిజన్:
9010973030, 9010234557
Office mail : sakshiadvtvsp@gmail.com